క్లుప్తంగా

రేపటి నుంచి రైతులకు శిక్షణ

మైదుకూరు : ఉద్యాన పంటలపై రైతులకు మంగళవారం నుంచి ఐదు రోజులపాటు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం ఆవరణలో ప్రతి రోజు ఉదయం 10.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఉద్యాన పంటలు – మేలైన యాజమాన్య పద్ధతులు అనే అంశంపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

రేపు మాదక ద్రవ్యాల నిర్మూలనపై ర్యాలీ



ఆహ్వాన పత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : మాదక ద్రవ్యాల నిర్మూలనపై మంగళవారం స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వికసిత ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శూలం లక్ష్మీదేవి తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ర్యాలీకి సంబంధించిన ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో సోమవారం నుంచి 23వ తేదీ వరకు మాదక ద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు విజయకుమార్ సర్కిల్ నుంచి శివాలయం సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు విజయకుమార్, మల్లేష్ పాల్గొన్నారు.

నేడు ప్రజావేదిక

గోపవరం : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి నాగరాజ, తహసీల్దారు ఉదయభారతి పేర్కొన్నారు. అన్నిశాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగా ఎలాంటి సమస్యలు ఉన్నా అర్జీల రూపంలో అధికారులకు సమర్పించి పరిష్కరించుకోవాలని మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పంట నమోదుకు 15 ఆఖరు తేదీ

బి.కోడూరు : ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంట నమోదుకు ఈ నెల 15వ తేదీ లోగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సునీల్‌కుమార్ తెలిపారు. స్థానిక రైతుసేవా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఆ రైతుకు సంబంధించిన ఆధార్‌కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు అకౌంట్‌తో పాటు ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబరును వెంట తీసుకెళ్లి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు.

వరద భాధితులకు చేయూత



వరద బాధితులకు భోజనం అందజేస్తున్న అంబవరం ప్రతాప్‌రెడ్డి

అట్లూరు : విజయవాడ వరద భాధితులకు బద్వేలు వాసి చేయూత అందించారు. కడప జిల్లా బద్వేలు మండల చింతలచెరువు గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది, సైకాలజిస్ట్ డాక్టర్ అంబవరం ప్రతాప్‌రెడ్డి, అంబవరం నీరా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వరద బాధితులకు ఎండీఆర్ఎఫ్ సిబ్బంది సహకారంతో పడవలో ఇంటింటికీ వెళ్లి భోజనం, తాగునీటి బాటిళ్లు, బిస్కెట్లు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు.

ప్రపంచ ఫిజియోథెరపీ వేడుకలు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రపంచ ఫిజియోథెరపీ డే సందర్భంగా ప్రొద్దుటూరులో ఆదివారం వేడుకలు నిర్వహించారు. ప్రొద్దుటూరు ఫిజియోథెరపీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సర్వేష్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా రాయలసీమ వ్యాయామ కళాశాలలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ట్రోఫీ, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వీరకుమార్‌రెడ్డి, సత్యప్రవీణ్, క్రిష్ణమోహన్, సుదర్శన్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జై జై గణేశా.. జై కొడతా గణేశా..!

- ఘనంగా వినాయక చవితి వేడుకలు
- వాడవాడలా కొలువైన బొజ్జగణపయ్య

బద్వేలు అర్బన్ : వినాయక చవితి పండుగను శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. బద్వేలు పట్టణంతో పాటు రూరల్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో కూడా పండుగను వైభవంగా జరుపుకున్నారు. అలాగే ఇళ్లలో కూడా వినాయకుని ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. అలాగే దుకాణాలు, వ్యాపార సంస్థల్లో కూడా పూజలు జరిపారు.

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా

ప్రొద్దుటూరు కల్చరల్ : వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు ప్రాంతాలలో గణనాథుడు వివిధ రూపాలలో కొలువుదీరాడు. దండాలయ్యా ఉండ్రాలయ్యా అంటూ భక్తులు తమ కోరికలను నెరవేర్చాలని కోరుతూ భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శివాలయంలో చతుర్ముఖ శ్వేత గణపతి, మేదరవీధిలో బాలగణపతి, నేతాజీ నగర్‌లో శివగణపతి, మనోజీరావు వీధిలో సూర్యగణపతి, బాలాజీ అపార్ట్‌మెంట్ వద్ద గజ గణపతి, వైఎంఆర్ కాలనీలో సరస్వతీ విద్యామందిరంలో సీతారామ గణపతి, తాళ్లమాపురం మట్టితో చేసిన కాణిపాక వరసిద్ధి వినాయకుడు ఇలా ప్రతి చోట ఒక్కో ప్రత్యేక రూపంలో గణనాధుడు భక్తులకు దర్శనమిచ్చాడు. సోమవారం కొన్ని ఉత్సవ కమిటీ వారు ఏకదంతున్ని నిమజ్జనానికి తరలించనున్నారు.

కొలువు తీరిన బొజ్జ గణపయ్య

రాజుపాళెం : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం మండలంలోని గ్రామాల్లో బొజ్జ గణపయ్య కొలువుదీరాడు. విఘ్నేశ్వరున్ని పూలతో విశేషాలంకారం చేసి పత్తెర, వెలగపండు, ఉండ్రాళ్లు, చెరకు గడలు, పండ్లు, నైవేద్యం సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు. విఘ్నాలు రాకుండా అనుకున్న పనులు విజయవంతంగా పూర్తి కావాలని, భవిష్యత్ బాగుండాలని గణనాధున్ని ఆయా గ్రామస్తులు పూజించారు.

నిమజ్జన ప్రాంతాలను పరిశీలించిన డీఎస్పీ

వినాయక నిమజ్జన ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని ప్రొద్దుటూరు డీఎస్పీ భక్తవత్సలం సూచించారు. మండలంలోని వెల్లాల, వెలవలి గ్రామాల పరిధిలో కుందూనదిని ఆయన శనివారం రూరల్ సీఐ బాల మద్దిలేటితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిమజ్జన ప్రాంతాల్లో ఎటువంటి పొరపాట్లు జరగవద్దని సూచించారు.

వెల్లాల ఆలయాల్లో పూజలు

మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వామి ఆలయాల్లో శనివారం డీఎస్పీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డీఎస్పీ, సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ వెంకటరమణకు శాలువ కప్పి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

దువ్వూరు : వినాయక చవితి పండుగను పురస్కరించుకుని దువ్వూరు మండల వ్యాప్తంగా శని, ఆదివారాల్లో చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలో 116 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో గణనాథులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో వినాయక చవితి

మైదుకూరు : మైదుకూరులో వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ప్రత్యేక అలంకరణలతో మండపాలు ఆకట్టుకున్నాయి. భజనలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కాగా పలువురు వినాయక ప్రతిమలను ఆదివారం నిమజ్జనం చేశారు.

జై బోలో గణేష్ మారాజ్‌కి జై

చాపాడు : మండల వ్యాప్తంగా శని, ఆదివారాల్లో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచి మండలంలోని పలు గ్రామాల్లో వినాయక విగ్రహాల ప్రతిమలను నిలబెట్టారు. వినాయకుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు స్వామివారి ప్రసాదం పంపిణీ చేశారు. మండలంలోని అల్లాడుపల్లెలో నిర్వహించిన వినాయకుడి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించిన పుట్టా మాట్లాడుతూ.. వినాయక చవితిని సంతోషాల నడుమ నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఇదే క్రమంలో వినాయక ఉత్సవాలలో రెండో రోజైన ఆదివారం మండలంలోని సిద్దారెడ్డిపల్లె, మొర్రాయిపల్లె, నాగాయపల్లె గ్రామాలలో స్వామి ఉత్సవ ఊరేగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

పోరుమామిళ్ల : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలో గణేశుని విగ్రహాలు ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్ని వీధుల్లో మహిళలకు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించగా.. మరి కొన్ని వీధుల్లో భజనలు, కోలాటాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం మండపాల వద్ద అన్నదానం నిర్వహించారు.

గణపయ్యా .. మనసా స్మరామి

కాశినాయన : వినాయకచవితి పండుగను పురస్కరించుకుని ఊరువాడా విగ్రహాలను ప్రతిష్ఠించారు. మండలంలో 35 వినాయక ప్రతిమలను ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలు అందరూ పాల్గొని పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. సోమవారం కొన్ని విగ్రహాలు, బుధవారం మరి కొన్ని విగ్రహాలను వినాయక నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

గణనాథుడికి ఘనంగా పూజలు

గోపవరం : వినాయకచవితి పర్వదినం సందర్భంగా గణనాథులకు శనివారం ఘనంగా పూజలు నిర్వహించారు. మండల వ్యాప్తంగా వినాయకచవితిని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నిమజ్జనానికి సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బద్వేలు రూరల్ పోలీసులు పర్యవేక్షిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు వర్షాలు పడకపోవడంతో గణనాథుల నిమజ్జనానికి ఆటంకం ఏర్పడింది. సోమశిల ప్రాజెక్టు వెనుకజలాల్లో నిమజ్జనం చేయనున్నారు. మరికొందరు సిద్దవటం పెన్నా నదిలో నిమజ్జనానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

వైభవంగా చవితి వేడుకలు

బ్రహ్మంగారిమఠం : మండల వ్యాప్తంగా వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటుచేసి వినాయక ప్రతిమలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు.

భజన పుల్లయ్యకు ప్రత్యేక సన్మానం

మండలంలోని చౌదరవారిపల్లె పంచాయతీ గుండాపురం గ్రామంలో వినాయక చవితి సందర్భంగా భజన పుల్లయ్యకు గ్రామ ప్రజలు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తోట్లపల్లె అచలానంద ఆశ్రమం పీఠాధిపతి శ్రీ విరజానంద స్వామి, ఆచార్య డాక్టర్ ఎన్ ఈశ్వర్‌రెడ్డి, శిల్పి చిత్రాల కళారత్న గొల్లపల్లె జయన్న, ఓ రాజశేఖర్, బి.మఠం ఈశ్వర్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన వెలసిన గణనాథుడు

బి.కోడూరు : మండలవ్యాప్తంగా శనివారం వినాయక విగ్రహాలను ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసి ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా మండలంలో సుమారు 30 పైగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు.

ఘనంగా వినాయక చవితి వేడుకలు

కలసపాడు : వినాయకచవితి పండుగ సందర్భంగా మండల వ్యాప్తంగా కొలువుదీరిన గణనాథులకు శని, ఆదివారాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా పూజలు నిర్వహించారు. సోమవారం వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పండుగ సందర్భంగా కోలాటాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.




పోరుమామిళ్ల : కోటవీధిలో..



దువ్వూరు: అశోక్ నగర్ వీధిలో..



కలసపాడు : వేంకటేశ్వరరెడ్డి కాలనీలో..



ప్రొద్దుటూరులో బాలగణపతి



రాజుపాళెం: పూజలందుకుంటున్న గణనాథుడు



కాశినాయన : బాలాయపల్లెలో విఘ్నేశ్వరునికి పూజలు చేస్తున్న మహిళలు



మైదుకూరు : పట్టణంలోని శీలంనగర్‌లో ప్రతిష్ఠించిన వినాయకుని విగ్రహం



బి.కోడూరు : మేకవారిపల్లెలో కొలువుదీరిన వినాయకుడు



బద్వేలు అర్బన్ : ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడు



గోపవరం: రాచాయపేటలో గణనాథునికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ప్రొద్దుటూరు కల్చరల్: మిట్టమడి వీధిలో కొలువైన ఏకదంతుడు



చాపాడు: అల్లాడుపల్లెలో వినాయక ఉత్సవాల్లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే పుట్టా



బ్రహ్మంగారిమఠం: బొజ్జగణపయ్యకు ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు



రాజుపాళెం: వెల్లాల కుందూనది వద్ద నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ భక్తవత్సలం

నిర్దేశించిన ప్రాంతాల్లోనే నిమజ్జనం చేయాలి



మాట్లాడుతున్న రూరల్ సీఐ బాలమద్దిలేటి

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని చెన్నమరాజుపల్లె, కామనూరు బ్రిడ్జి కుందూనది బ్రిడ్జి వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు చేశామని, ఇతర ప్రాంతాల్లో నిమజ్జనం చేయవద్దని ప్రొద్దుటూరు రూరల్ సీఐ బాల మద్దిలేటి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వాతావరణ శాఖ వారి సమాచారం మేరకు వర్షాలు ఎక్కువగా ఉన్నందున పగటి సమయంలో వినాయక విగ్రహాల నిమజ్జనం చేయాలని సూచించారు. భక్తులు సాధ్యమైనంత త్వరగా పగలు సమయంలో గణేష్ నిమజ్జనంకు బయల్దేరాలని సూచించారు. దువ్వూరు క్రాస్ రోడ్డు నుంచి చెన్నమరాజుపల్లె మీదుగా నిమజ్జన ప్రదేశానికి వెళ్లి నిమజ్జనం అనంతరం కామనూరు, నక్కలదిన్నె, గోపవరం మీదుగా కొర్రపాడు రోడ్డుకు వెళ్లాలని పేర్కొన్నారు. ఊరేగింపు సమయంలో ఎలాంటి డీజేలు, క్రాకర్స్ పేల్చడానికి అనుమతి లేదన్నారు. కావునా భక్తులు సహకరించి వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐ కోరారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు సిద్ధం

చాపాడు : వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని రెండో రోజు నుంచి మొదలు కానున్న నిమజ్జన కార్యక్రమానికి మండలంలోని కుందూనది వద్ద అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. మండలంలోని సీతారామాపురం, అన్నవరం గ్రామాల వద్ద కుందూనదిపై ఎస్ఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యవంతంగా ఏర్పాటు చేశారు. మైదుకూరు, ప్రొద్దుటూరు, దువ్వూరు ప్రాంతాల నుంచి వందలాది వినాయక విగ్రహాలను చాపాడు మండలంలోని సీతారామాపురం, అన్నవరం గ్రామాల వద్ద గల కుందూనది వద్దకు తీసుకురానున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిమజ్జనానికి వచ్చే భక్తులు నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపరాదని సూచించారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఆర్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు జగన్

ప్రొద్దుటూరు : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహం –2 వద్ద ఆర్ఎస్ఓ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ వసతి గృహాల వార్డెన్లకు 8 నెలలుగా బిల్లులు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బిల్లులు రాకపోవడంతో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించలేకపోతున్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాలు 8 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని తెలిపారు.

జేవీవీ కృషి అభినందనీయం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

పోరుమామిళ్ల : శాస్త్రీయ సమాజ నిర్మాణమే ధ్యేయంగా జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయమని ప్రభుత్వ వైద్యులు జయరామ్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గంగయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఆఫ్రిది ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేవీవీ నాయకులు దాదాపీర్, ఖాశింవలి, గఫార్ మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో సెప్టెంబర్ 25న, మండల స్థాయిలో అక్టోబర్ 1న, జిల్లా స్థాయిలో అక్టోబర్ 27న చెకుముకి సైన్స్ ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 8,9,10 తరగతుల విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొని ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న ఈ పరీక్షలను పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన మండలాల్లోని ప్రధానోపాధ్యాయులు విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు.

రేపు జాబ్ మేళా

ప్రొద్దుటూరు : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏరియా కోఆర్డినేటర్ లావణ్య, ఏపీఓ సుబ్బమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. రిలయన్స్ రీటైల్ లిమిటెడ్‌లో కస్టమర్ సేల్స్ అసోసియేట్, అమేజాన్‌లో డెలివరీ అసోసియేట్స్, ఆఫీస్ స్టాఫ్, ఎయిల్ డిక్సన్‌లో అసెంబ్లీ ఆపరేటర్స్ ఉద్యోగాలు ఉన్నట్లు వారు పేర్కొన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9000401382 సెల్ నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

బద్వేలు అర్బన్ : కడపజిల్లా కొప్పర్తి మెగా ఇండస్ట్రీయల్ పార్క్‌లో గల ప్రముఖ ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కంపెనీ ఏఐఎల్ డిక్సన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగాల కోసం ఈ నెల 10న రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ ఆర్.వి.సాయికృష్ణ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే ఈ జాబ్‌మేళాకు పది, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, ఐటీఐ, బి.టెక్ పూర్తి చేసిన 19–32 సంవత్సరాలలోపు వయస్సు గల విద్యార్థులు అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు కళాశాలలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9515437935, 9515437934 నంబర్లను సంప్రదించాలని కోరారు.

భూ రీ సర్వే నిర్వహించాలి



మాట్లాడుతున్న బాలయ్య

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని బొజ్జవారిపల్లెలో ఉన్న తమ భూమికి రీ సర్వే నిర్వహించాలని ఆ గ్రామానికి చెందిన బుర్రి బాలయ్య కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామంలోని సర్వే నంబర్ 291/1(బి), 291/2(బీ)లలో 73 సెంట్ల భూమి ఉందని తెలిపారు. జగనన్న భూ సర్వే చేశారన్నారు. అయితే పక్క పొలం యజమానుల ప్రోద్బలంతో సర్వేయర్, వీఆర్ఓలు హడావిడిగా సర్వే నిర్వహించి పది సెంట్లు ఆక్రమించి రాళ్లు పాతడం దారుణమన్నారు. వీఆర్ఓ, సర్వేయర్ల నిర్వాకంపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఆర్డీఓలకు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు స్పందించి భూమి రీ సర్వేచేసి తమ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో కుటుంబీకులు వెంకట సుబ్బమ్మ, నాగేంద్ర పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీలు



పరుగు పోటీల్లో క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఆదివారం బాషా అథ్లెటిక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 200 మందికి పైగా క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభతో అందరిని ఆకట్టుకున్నారు. అండర్– 18, 20, 23 స్త్రీ, పురుషులకు 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 1000 మీటర్లు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో విభాగాలలో పోటీలు నిర్వహించారు. మొదటి, రెండవ స్థానంలో నిలిచిన క్రీడాకారులను గుంటూరు ఆచార్య నాగార్జున యనివర్సిటీలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొంటారని ఫౌండేషన్ కార్యదర్శి అహ్మర్ బాషా తెలిపారు. పోటీలను వ్యాయామ సంచాలకులు నాగూర్‌బాషా, రాఘవేంద్ర, నాగేశ్వరరావు, అనిల్, ఖాదర్‌రెడ్డి, దిలీప్, మురళి, కుమార్, పెంచల్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి పర్యవేక్షించారు.

అసైన్డ్ చట్టాన్ని అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

బద్వేలు అర్బన్ : అసైన్డ్ చట్టం 9/77ను పక్కాగా అమలు చేసి పేదలకు ప్రభుత్వ భూములు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జీఓ హోంలో శనివారం నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా జిల్లాలో అసైన్డ్ కమిటీ ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని విమర్శించారు. రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు పెట్టి అసైన్డ్‌మెంట్ కమిటీ సమావేశాలు నిర్వహించి పేదలు సాగులో ఉన్న భూములను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.శివకుమార్, వి.అన్వేష్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేష్, నరసయ్య, జిల్లా కమిటీ సభ్యులు పోలయ్య, రాయప్ప, రామ్మోహన్, వెంకటసుబ్బమ్మలతో పాటు వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

రేపు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ ఆందోళన

బద్వేలు అర్బన్ : రాష్ట్రానికే తలమానికంగా ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కడప కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో చరిత్ర ఉన్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోకపోగా ప్రైవేటీకరణకు ప్రయత్నించడం దారుణమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, పట్టణ నాయకులు మస్తాన్‌షరీఫ్, ఆదిల్, ఫాతిమా పాల్గొన్నారు.

అన్ని పాఠశాలలను ఒకే గొడుగు కిందికి తేవాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలలను ఒకే గొడుగు కిందికి తేవాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఆదివారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని కడపలోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్షరాస్యత– ప్రస్తుత సమస్యలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని వర్గాల ప్రజలకు సమాన విద్య అందించాలని డిమాండ్ చేశారు. విద్య కొనే విధానానికి ప్రజాస్వామ్య దేశాలలో స్వస్తి పలకాల్సిన అవసరం ఉందని తెలిపారు.